E-KABURU e paper
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
21-3-2025 శుక్రవారం | పేజీలు-6 | హైదరాబాద్ | ekaburu.com




రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు..

2లో

# నెల రోజుల్లో గ్రూప్-2, 3 నియామకాలు

సీఎం పదవి చేపట్టడం కన్నా..
జడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు



- 'బిల్డ్ నౌ పోర్టల్' ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి
- రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసింది వాస్తవం
- ఉన్నది చెప్తే పరువుపోతదా?
- నెలరోజుల్లో గ్రూప్2,3 నియామకాలు
- ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చాం
- నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసి బీఆర్ఎస్ ఓటమి
- కారుణ్య నియామకాలపై గతంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు

**ఈ-కబురు హైదరాబాద్:** సీఎం పదవి చేపట్టడం కన్నా.. జడ్పీటీసీగా గెలిచినప్పుడే ఎక్కువ ఆనందం కలిగిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటిసారిగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'ప్రజాపాలనలో కొలువుల పండగ' కార్యక్రమంలో ఆయన పాల్గొని 'బిల్డ్ నౌ పోర్టల్'ను ప్రారంభించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పురపాలక శాఖల్లో కారుణ్య నియామకాలకు సంబంధించి 922 మందికి నియామక పత్రాలు 2లో



## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్లు..

# 30 మంది మావోయిస్టుల మృతి

**ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పలువురు మావోయిస్టులు మృతి చెందారు.**

**ఈ-కబురు :** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లుతోంది. ఒకేరోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్ల లో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా అమరుడైనట్లు అధికారులు వెల్లడించారు.
బీజాపూర్ దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరుగుతున్నాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలో 26 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.
ఇక, ఇదే సమయంలో కాంకెర్ జిల్లాలోనూ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇక్కడ డీఆర్‌జీ, బీఎస్ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా తరువాయి 2లో

# 2026 నాటికి మావోయిస్టు రహితంగా భారత్

## ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లపై అమిత్ షా

2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశంగా భారత్ మారుతుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 2లో


## ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం

# తీపి కబురు..

**ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు సీఎం చంద్రబాబు నిర్ణయం..**

**ఉద్యోగులకు రూ. 6,200 కోట్లు చెల్లించాలని సీఎం చంద్రబాబు ఆదేశం..**

**సీఎం ఆదేశాలతో రేపు రూ. 6,200 కోట్లు విడుదల చేయనున్న ఆర్థిక శాఖ..**



**ఈ-కబురు :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉద్యోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. ఇక, ఉద్యోగుల బకాయిల చెల్లింపులు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తక్షణమే, ఉద్యోగులకు 6,200 కోట్ల రూపాయలు చెల్లించాలని సీఎం ఆదేశాలు తరువాయి 2లో

## భారత్ టారిఫ్‌లు తగ్గిస్తుందని భావిస్తున్నా: ట్రంప్

2లో



## వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేస్తా: కేటీఆర్




**వచ్చే ఏడాది తాను పాదయాత్ర చేయనున్నట్లు భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. భారాసను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు.**

**ఈ-కబురు హైదరాబాద్:** భారాసను అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా వచ్చే ఏడాది నుంచి పాదయాత్ర చేయనున్నట్టు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాదయాత్రపై కసరత్తు జరుగుతోందని, తాను సిద్ధమవుతున్నానని తెలిపారు. అధినేత అనుమతితో వచ్చే ఏడాది నుంచి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు.
ప్రస్తుతం జిల్లాల పర్యటనలు ప్రారంభించానన్న కేటీఆర్.. డిసెంబరు వరకు పార్టీ బలోపేతం చేసే కార్యక్రమాల్లో నిమగ్నం అవుతామని చెప్పారు. భారాస రజతోత్సవాలతో పాటు శిక్షణా తరగతులు, సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు సంస్థాగత కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు వివరించారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలకు అద్భుత స్పందన వస్తోందని, సూర్యాపేట కార్యక్రమానికి బహిరంగసభ తరహాలో జనం తరలివచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ తెలిపారు.



ఐపీఎల్ 18 సందడి షురూ..
ఒక్కచోట చేరి ఫొటోలకు పోజులిచ్చిన కెప్టెన్లు

6లో

## కొత్త రేటుకు చేరిన బంగారం



4లో

## కర్ణాటకలో.. మంత్రులు సహా 48 మంది నేతలపై 'హనీ ట్రాప్'!



**కర్ణాటకలో అనేక మంది మంత్రులు సహా రాజకీయ నాయకులు లక్ష్యంగా హనీ ట్రాప్ వ్యవహారం కొనసాగుతోందని మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు.**


**ఈ-కబురు:** కర్ణాటకలో మంత్రులు సహా అనేక మందిపై 'హనీ ట్రాప్' వ్యవహారం అక్కడి రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. అనేక మంది మంత్రులు సహా ముఖ్య నేతలే లక్ష్యంగా 2లో

## విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు

విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ పొన్నా త్రిమూర్తులు



3లో



## 2026 నాటికి మావోయిస్టు రహితంగా భారత్: ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లపై అమిత్ షా

**2026 మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత దేశంగా భారత్ మారుతుందని కేంద్రమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.**

**ఈ-కబురు దిల్లీ:** ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన కాల్పుల్లో 22 మావోయిస్టులు మృతి చెందిన ఘటనపై కేంద్రమంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్‌లో ఇది మరో పెద్ద విజయమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోందని పేర్కొన్నారు.

''అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు లొంగిపోవడం లేదు. అలాంటి వారి పట్ల మోదీ సర్కార్ కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈనాడు మన సైనికులు 'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాంకెర్‌లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 22 మంది నక్సలైట్లు హతమయ్యారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుంది'' అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా అమిత్ షా పేర్కొన్నారు.

'నాన్న డ్రమ్ములో ఉన్నాడు'.. మర్చంట్ నేవీ అధికారి హత్యపై ఆరేళ్ల కుమార్తె మాటలు

కాగా.. ఒకే రోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఈ కాల్పుల్లో 22 మంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను అమరుడయ్యారు. ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు. బీజాపూర్ దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రి అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా సమాచారం వచ్చింది. దీంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.



## 30 మంది మావోయిస్టుల మృతి

మొదటి పేజీ తరువాయి

జరిపిన ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు జిల్లాల్లోనూ ప్రస్తుతం యాంటీనక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతోంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**మూడు నెలల్లో 90 మంది..**

ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్లలో ఇది రెండో అతిపెద్ద ఘటన. ఫిబ్రవరి 9న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోలు హతమమైన సంగతి తెలిసిందే. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు చోటుచేసుకున్న పలు ఎన్‌కౌంటర్లలో దాదాపు 90 మంది నక్సల్స్ మృతి చెందినట్లు అంచనా.

## కర్ణాటకలో.. మంత్రులు సహా 48 మంది నేతలపై 'హనీ ట్రాప్'!

మొదటి పేజీ తరువాయి



ఈ వలపు వల ఘటనలు కొనసాగుతున్నాయని తెలిసింది. జాతీయ స్థాయి నేతలు సహా 48 మంది రాజకీయ నాయకులు ఇందులో బాధితులుగా ఉన్నారంటూ ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు అసెంబ్లీలో తీవ్ర దుమారం రేపాయి. దీనిపై విచారణ జరిపించాలని అధికార, విపక్ష పార్టీ సభ్యులు డిమాండ్ చేసిన నేపథ్యంలో అందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

48 మంది వీడియోలు..

రాష్ట్రానికి చెందిన అనేక మంది రాజకీయ నేతలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారని కర్ణాటక సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న అసెంబ్లీలో పేర్కొనడం తీవ్ర చర్చనీయాంశమైంది. తనకు తెలిసినంతవరకు కనీసం 48 మంది ఇందులో బాధితులుగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో వారి అసభ్య వీడియోలు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదన్నారు. అధికారపక్షం సహా విపక్షానికి చెందిన వారు ఈ బాధితుల్లో ఉన్నారని అన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి దర్యాప్తు అవసరమన్న ఆయన.. దీనిపై హోంశాఖకు ఫిర్యాదు చేస్తానన్నారు. దీని వెనక ఎవరు ఉన్నారనే విషయం బయటపడుతుందని, ప్రజలకు కూడా ఈ విషయాలు తెలియాలని మంత్రి రాజన్న స్పష్టం చేశారు.

గ్లాసు నీటి విషయంలో గొడవ.. కేంద్ర మంత్రి మేనల్లుడి హత్య

అంతకుముందు ఇదే అంశంపై మంత్రి సతీశ్ జార్కిహోళీ మాట్లాడుతూ.. ఒక మంత్రిపై రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం వాస్తవమేనన్నారు. అయితే, ఇది రాష్ట్రానికి కొత్త కాదని, రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది వీటిని వాడుకుంటున్నారని అన్నారు. ఈ తరహా ఘటనలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై ఫిర్యాదు చేయాలని సదరు మంత్రికి సూచించామని, వెంటనే దర్యాప్తు మొదలు పెడతామన్నారు. మరోవైపు ఇదే వ్యవహారంపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ.. ఎవరినైనా అరెస్టు చేశారో లేదోనన్న విషయం తనకు తెలియదన్నారు. దర్యాప్తు పూర్తయితే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

### రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు..

# విద్యార్థులకి కీలక సూచనలు ఇవే

**ఈ-కబురు:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతికి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం 2650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 2,58,895 మంది అబ్బాయిలు, 2,50,508 మంది అమ్మాయిలు..

రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లను స్కూల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. శుక్రవారం నుంచి ప్రారంభ మయ్యే పరీక్షలు ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయి. అయితే, కాంపోజిట్ కోర్సు లో ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్ష మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరగనుండగా.. సైన్స్ సబ్జెక్టులకు ఫిజికల్, బయోలజీ పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు రెండు రోజులు నిర్వహిస్తారు.




రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతికి పరీక్షల కోసం 2650 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో 2,58,895 మంది అబ్బాయిలు, 2,50,508 మంది అమ్మాయిలు ఉన్నారు. పదో పరీక్షల నిర్వహణలో భాగంగా 2,650 మంది సీఎస్ లు, డీవోలను, 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇప్పటికే పాఠశాలల ద్వారా విద్యార్థులకు హాల్ టికెట్ల జారీ చేసిన ఎగ్జామినేషన్ విభాగం.. అందని స్టూడెంట్స్ నేరుగా వారి హాల్ టికెట్లను వెబ్ సైట్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చునని తెలిపింది.

ఒక్క నిమిషం నిబంధనతో విద్యార్థులు చివరి నిమిషంలో ఉరుకులు పరుగులు తీస్తుండడం మరి కొంతమంది పరీక్షలు మిస్ అవుతుండడంతో ఈసారి విద్యార్థులకు ఊరటనిచ్చింది స్కూల్ ఎడ్యుకేషన్ విభాగం. ఈసారి నుంచి విద్యార్థులకు కొంత వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరీక్ష నిర్ణీత సమయం కంటే ఐదు నిమిషాల గ్రేస్ పీరియడ్ ఇచ్చారు. అంటే ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. అయితే, విద్యార్థులు కనీసం అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆలస్యంగా పరీక్షా కేంద్రానికివెళ్లి ఇబ్బంది పడటంకంటే.. అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకుంటే టెన్షన్ లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయవచ్చునని అధికారులు సూచిస్తున్నారు.

పరీక్ష కేంద్రాలకు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు దాంతోపాటు పరీక్షా కేంద్రం సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. మాల్ ప్రాక్టీస్ లేదా ఇతరత్రా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు ఇప్పటికే హెచ్చరించారు. ప్రతి పరీక్షా కేంద్రం చీఫ్ సూపర్డెంట్ ఆఫీస్ రూమ్ లో ఒక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడ హైదరాబాద్లోని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆఫీస్ లోని కంట్రోల్ రూమ్ నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు. విద్యార్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ గార్డెన్స్ తీసుకొని రావద్దని సూచించారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే ప్రశ్న పత్రాలపై క్యూఆర్ కోడ్ తో పాటు సీరియల్ నెంబర్ను విద్యాశాఖ ముద్రించింది.

ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకొని రా వద్దని విద్యాశాఖ సూచించింద. విద్యార్థులు హాల్ టికెట్ పెన్, పెన్సిల్, పాడ్, ఎరేజర్, జమిట్రిక్ పరికరాలు మాత్రమే తీసుకొని రావాలి. పరీక్ష ప్రశ్నాపత్రం ఇచ్చిన వెంటనే ప్రతి పేపర్ పై విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్ రాయాల్సి ఉంటుంది. కానీ ఆన్సర్ షీట్ ఇచ్చిన తర్వాత ఆన్సర్ షీట్ పై మాత్రం ఎలాంటి నెంబర్లు పేరు వివరాలు సంకేతాలు లాంటివి రాయొద్దని విద్యాశాఖ సూచించింది. పరీక్షా సమయం పూర్తయ్యే వరకు ఎగ్జామ్ హాల్లోనే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది.

# నెల రోజుల్లో గ్రూప్-2, 3 నియామకాలు

మొదటి పేజీ తరువాయి

అందజేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. కారుణ్య నియామకాలు క్రమం తప్పకుండా చేపట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.

''కారుణ్య నియామకాలు మీ హక్కు. గత ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం వల్ల మీరు పదేళ్లు నష్టపోయారు. జాబ్ క్యాలెండర్‌తో పాటుగా కారుణ్య నియామకాలు కూడా ఇవ్వాల్సిందే. తెలంగాణ ఉద్యమంలో నిరుద్యోగుల పాత్ర మరువలేనిది. స్వరాష్ట్రం వచ్చినా నిరుద్యోగుల కల నెరవేరలేదు. పేదలు, బడుగుబలహీన వర్గాలవారే పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. నిరుద్యోగుల బాధలను ప్రజా ప్రభుత్వం గుర్తించింది. అందుకే ఏడాదిలోనే 59వేల ఉద్యోగాలు ఇచ్చాం.

నిరుద్యోగులను నిర్లక్ష్యం చేయడం వల్లే భారాస ఓడిపోయింది. మాకు ఉద్యోగాలు ఇవ్వని మీకు ఉద్యోగాలు ఎందుకని నిరుద్యోగులు భారాసను ఓడించారు. కారుణ్య నియామకాలపై మాట్లాడే హక్కు భారాసకు లేదు. నిరుద్యోగుల బాధలు నాకు తెలుసు. ఉద్యోగ ఖాళీలను పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలిచ్చా. పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలోనే ఫలితాలు ఇచ్చాం. 30, 40 రోజుల్లో గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3 ఉద్యోగాల నియామకాలు పూర్తి చేస్తాం. ఉద్యోగాలు ఇచ్చినా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి''అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.




# భారత్ టారిఫ్‌లు తగ్గిస్తుందని భావిస్తున్నా: ట్రంప్

**భారత్ విధించే పన్నుల విషయంలో ట్రంప్ స్వరం మారింది.**

**ఈ-కబురు:** భారత్ విధించే టారిఫ్‌లు తగ్గింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారింది. న్యూదిల్లీ సుంకాలను తగ్గించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. తాజాగా ఆయన బ్రీట్‌బాట్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ భారత్ పన్నులు తగ్గించేందుకు అంగీకరించిందని.. అదంతా తన ఘనతే అని చెప్పుకొచ్చారు.

తాజాగా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ''భారత్ టారిఫ్‌లను గణనీయంగా తగ్గించే అవకాశం ఉన్నట్లు నమ్ముతున్నాను. కానీ, ఏప్రిల్ 2 నుంచి వారెంత విధిస్తే.. మేమూ అంతే విధిస్తాం'' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఆయన ఏప్రిల్ 2ను లిబరేషన్‌డేగా అభివర్ణిస్తుండటం గమనార్హం.


వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య పన్నుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకొంటాయన్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. ఒకవేళ పన్నుల తగ్గింపు నిర్ణయం వెలువడితే అది భారత ఆర్థికవ్యవస్థపై, వాణిజ్య మిగులు, ఫైనాన్షియల్ మార్కెట్లపై ప్రభావం చూపించనుంది. ముఖ్యంగా వ్యవసాయోత్పత్తులు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, రంగాలు భారీ పోటీని ఎదుర్కోనున్నాయి. దీంతోపాటు భారత ప్రభుత్వానికి పన్నులు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న విషయం తెలిసిందే. ట్రంప్ భారత్‌లో పన్నుల విధానాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. గతంలో కూడా ఆయన మాట్లాడుతూ ''భారత్ టారిఫ్ కింగ్'' అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. భారత్‌అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్లు ఉన్న విషయాన్ని కూడా ఆయన ఎత్తిచూపారు.



**హెచ్-1బీ వీసాలో మార్పులు..**

**ఆ రికార్డులన్నీ తొలగింపు..!**

మరోవైపు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మాత్రం ఇటీవల మాట్లాడుతూ.. ''మీరు నమ్మినా, నమ్మకపోయినా..సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలు చేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని మీరు గమనించినట్లయితే.. సామర్థ్యమేదైనా గొప్ప ఆయుధీకరణను చూశాం. ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే ఆ వ్యాపారం కోసం దేశాలు పోటీపడుతున్నాయి.'' అని వెల్లడించారు.



## ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు..

మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. దీంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రేపు సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఎఐ కింద రూ. 6,200 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేయనుంది. అయితే, రాష్ట్రంలో ప్రభుత్వానికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ.. ఉద్యోగులకు అండగా ఉన్నామన్న ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. కాగా, ఈ ఏడాది జనవరి 11వ తేదీన ఉద్యోగుల వివిధ బకాయిల కింద 1,033 కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది.


ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం

## మాతృమూర్తులు, పిల్లలకు కలిపి ఇండియా టీన్స్ ఫ్యాషన్ లీగ్

**గచ్చిబౌలి ఉర్దూ యూనివర్సిటీలో ఆవిష్కరణ**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** మాతృమూర్తులు, వారి పిల్లలతో కలిసి ఒకే వేదిక మీద నిర్వహించే ఫ్యాషన్ ఈవెంట్ 'ఇండియా టీన్స్ ఫ్యాషన్ లీగ్, మిసెస్ ఇండియా బ్యూటీ పిగెంట్ 2025' ని గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ఈ ఈవెంట్ కు సంబంధించిన ఆడిషన్స్ కొనసాగుతుండగా, ఫైనల్స్ మే నెలలో ఉర్దూ యూనివర్సిటీలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గురువారం నిర్వహించిన సమావేశంలో ఈవెంట్ బ్రోచర్ ను ఆవిష్కరించడంతో పాటు సమావేశంలో ఈవెంట్ వివరాలు వెల్లడించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలోని సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్, విబ్జార్ ఎంటర్టైన్మెంట్ అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ చైర్మన్ సమానా హుస్సేనీ, విబ్జార్ ఎంటర్టైన్మెంట్స్ ప్రతినిధి సుచరితలు మాట్లాడుతూ సాంప్రదాయ రీతిలో అందాన్ని నిర్వచించే పద్ధతికి భిన్నంగా వివాహిత మహిళల రూప లావణ్యాలు, తెలివితేటలు, వారి విజయగాథలు ఆధారంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాతృమూర్తులు వారి పిల్లలు కలిసి ఒకే వేదికను పంచుకోవడం ద్వారా కుటుంబ బంధాలను మరింత పటిష్టం చేసుకునే అమాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్ పట్వర్ధన్, అభిషేక్ అగర్వాల్ తో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న రవీందర్ యాదవ్

## మియాపూర్ స్కూల్ విద్యార్థులకు ఎగ్జామ్ ఫ్యాడ్, పెన్నులు అందజేసిన రవీందర్ యాదవ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న మియాపూర్ స్కూల్ విద్యార్థులకు శేరిలింగంపల్లి బీఆర్ఎస్ పార్టీ నాయకులు రవీందర్ యాదవ్ గురువారం పరీక్ష సామాగ్రిని అందజేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 10వ తరగతి పరీక్షల కోసం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, ఇతర సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్ ను నిర్ణయించేది చదువేనని అన్నారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత స్థానాల్లో నిలువాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షల సమయం కావడంతో ఎవరూ ఆందోళన చెందకుండా, నిబద్ధతతో చదవితే మంచి మార్కులను సాధించడం సులువు అని స్టూడెంట్స్ కు సూచించారు. చదువుకు కుల, మతాలతో సంబంధం లేదని, ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు ఉపయోగపడేది కేవలం చదువేనని వెల్లడించారు. చదువుల్లో రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, స్కూల్ కి మంచి పేరును తీసుకురావాలన్నారు. చదువును బట్టి సమాజంలో గౌరవాలు దక్కుతాయన్నారు. ఎంత ఎత్తుకు ఎదగాలన్నా దానికి చదువు ఒక్కటే మార్గమన్నారు. పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులకు, చదివిన స్కూల్ కు మంచి పేరును తీసుకువచ్చేలా, భవిష్యత్ కి ఇప్పటి నుంచే బాటలు వేసుకుంటూ ముందుకు వెళ్లాలని రవీందర్ యాదవ్ విద్యార్థులకు సూచనలు చేశారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి



**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతిచెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... కొండాపూర్ మజీద్ బాండ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో నివాసం ఉండే పెండ్యాల రాజు(35) స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రాజుకు భార్య లావణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా రాజు గతకొంత కాలంగా మద్యానికి బానిసగా మారి కూలి పనులకు సైతం వెళ్లకుండా ఇంటి వద్దే ఖాళీగా ఉంటున్నాడు. గత రెండు రోజుల క్రితం రాజు భార్య లావణి, తన ఇద్దరు కుమారులతో కలిసి పటాన్ చెరు పరిధిలోని చిట్కూల్ లో గల తన పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రాజు ఇంటి వద్ద ఒక్కడే ఉండగా, ఓ గుర్తు తెలియని రాజు స్నేహితుడు వచ్చి ద్విచక్రవాహనం మీద తీసుకువెళ్లాడు. అనంతరం మద్యం మత్తులో ఉన్న రాజును బుధవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో ఇంటి ముందు ఉన్న అరుగు మీద వదిలిపెట్టి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం పక్క ఇంటి వారు లేచి చూడగా, రాజు నిర్జీవంగా చనిపోయి కనిపించాడు. దీంతో వారు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా రాజు శరీరం మీద స్వల్ప గాయాలు ఉన్నాయని, ఎక్కడైన పడిపోయిన కారణంగా తగిలిన గాయాలా లేక ఏవరైనా దాడి చేశారా అనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక తరువాతే రాజు ఏ విధంగా చనిపోయాడనే విషయం తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

# విద్యతోనే జీవితంలో ఉన్నత శిఖరాలు



### విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ పొన్నాడ త్రిమూర్తులు

**పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పలు సూచనలు చేసిన త్రిమూర్తులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే విద్య ఒక్కటే మార్గమని, చదువుల్లో ఉత్తమంగా రాణించినవారు తోటి వారికి ఆదర్శంగా నిలుస్తారని విద్యారత్న అవార్డు గ్రహీత, విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్, డాక్టర్ పొన్నాడ త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం నుండి రాష్ట్రంలో పదవ తరగతి పరీక్షలు ప్రారంభమవుతుండడంతో.. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు పొన్నాడ త్రిమూర్తులు పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్ ను నిర్ణయించేది చదువేనని అన్నారు. పదవ తరగతి పరీక్షలు ఓ విద్యార్థి జీవితంలో ఎంతో కీలకమైన దశ అని, భవిష్యత్తులో ఏ వైపు పయనించాలో దిశా నిర్దేశం చేసే విధంగా పదో తరగతి పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు ఆందోళన చెందవద్దని, నిబద్ధతతో చదవితే మంచి మార్కులను సాధించడం సులువు అని తెలిపారు. ప్రణాళికబద్ధంగా చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని, ఒత్తిడి కారణంగా మానసిక ప్రశాంతత లోపించడంతో పాటు చదువుకున్నది మర్చిపోయే ప్రమాదం ఉందన్నారు. మనం నేర్చుకున్న జ్ఞానానికి మార్కులు కొలమానం కాదని, కానీ వంద శాతం ప్రయత్నం, క్రమశిక్షణతో కూడిన అభ్యాసంతో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యా గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి విద్య నేర్పిన గురువులకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## అరేటే హాస్పిటల్ లో వరల్డ్ హెడ్ ఇంజ్యూరీ డే

**ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అలవాటుగా మార్చుకోవాలి**

**సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సిపి గజారావు భూపాల్**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరు అలవాటుగా మార్చుకోవాలని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ గబారావు భూపాల్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలి పరిధిలోని అరేటే హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వరల్డ్ హెడ్ ఇంజ్యూరీ డే కార్యక్రమానికి ట్రాఫిక్ జాయింట్ సిపి గజారావు భూపాల్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరేటే హాస్పిటల్స్ చైర్మన్ విజయేందర్ రెడ్డితో కలిసి సిబ్బంది, ఇతరులకు హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కమీషనర్ గజారావు భూపాల్ మాట్లాడుతూ చట్టపరమైన నిబంధనగా ట్రాఫిక్ నిబంధనలను చూడకుండా ప్రాణాలను కాపాడే సాధనాలుగా భావించాలన్నారు. రహదారుల మీద ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల మీద అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా కార్లు వెళ్లే లైన్లలో కార్లు మాత్రమే వెళ్లాలని, ద్విచక్రవాహనాలు వెళ్లే దారిలో బైకులు వెళ్లాలన్నారు. రహదారులు ఎంత వెడల్పుగా ఉంటున్నా ప్రమాదాలు చోటుచేసుకోవడం నిబంధనల మీద అవగాహన లేకపోవడమే కారణమన్నారు. నగరంలో ఫుట్ పాత్ లు అక్రమణకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని, దీని కారణంగా పాదచారులు రోడ్ల మీద నడుస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే క్షతగాత్రుడితో పాటు అతని కుటుంబం మొత్తం దాని పర్యావసనాన్ని అనుభవిస్తుందని అన్నారు. హాస్పిటల్స్ చైర్మన్ విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్టులు పెట్టుకోకపోవడం కారణంగానే ఎక్కువగా తలకు గాయాలు అవుతున్నాయని వాపోయారు. తమ ఆసుపత్రి ఆధ్వర్యంలో మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. గాయాల పాలై ఆసుపత్రుల చుట్టూ తిరిగే కంటే గాయాలు కాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవమే ఉత్తమమని సూచించారు. ఈ కార్యక్రమంలో అరేటే హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ పవన్ కుమార్, డాక్టర్లు రవీశ్ సుంకర, రామక్రిష్ణ చౌదరి తదితరులతో పాటు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆసుపత్రి సిబ్బందికి హెల్మెట్లను అందజేస్తున్న దృశ్యం


సమావేశంలో ప్రసంగిస్తున్న సిపి గజారావు భూపాల్

## బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ పై సైబరాబాద్ పోలీసుల ఉక్కుపాదం

**మియాపూర్ లో 25 మంది సినీ ప్రముఖులు, యూట్యూబర్ల మీద కేసు నమోదు**

**కేసు నమెదైన వారిలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాష్ రాజ్ తదితరులు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ వ్యవహారం తెలంగాణాలో మరోసారి చర్చనీయాంశంగా మారింది. గత రెండు రోజుల క్రితమే తెలంగాణ ఆర్టీసీ ఎండి విసి. సజ్జనార్ ఈ విషయం లేవనెత్తగా.. తాజాగా సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలో పలువురు తెలుగు సినీ ప్రముఖులు, యూట్యూబర్ల మీద కేసు నమోదు కావడం సంచలనంగా మారింది. సైబరాబాద్ కమీషనరేట్ పరిధిలోని మియాపూర్ పోలీస్ స్టేషన్ లో బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ వ్యక్తి పిర్యాదు చేయగా, పోలీసులు బుధవారం 25మందిపై కేసు నమోదుశారు. వీరిలో టాలీవుడ్ ప్రముఖులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్ తదితర అగ్ర నటులతో పాటు పలువురు నటులు, యూట్యూబర్లు ఉన్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

బెట్టింగ్ యాప్స్ కారణంగా యువత నష్టపోతున్నారని, బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మియాపూర్ కు చెందిన ప్రమోద్ శర్మ అనే వ్యక్తి ఈనెల 16వ తేదీన మియాపూర్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. ఈపిర్యాదుపై స్పందించిన మియాపూర్ పోలీసులు బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న మొత్తం 25 మందిపై కేసు నమోదు చేశారు. వీరిపై బిఎన్ఎస్ సెక్షన్ 318(4), 112, రెడ్విత్ 49, టిఎస్పీఏ 3.3(ఏ), 4, 66డి, ఐటిఏ 20002008 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కేసు నమోదైన వారందరికి నోటీసులు జారీ చేశారు. కేసు నమోదైన వారిలో సినీ నటులు రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్, అనన్య నాగేళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖిలతో పాటు వర్షిణి సౌందరరాజన్, వసంతి క్రిష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావనీ, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్ ఖాన్, విష్ణుప్రియ, హర్ష సాయి, భయ్యా సన్నీ యాదవ్, శ్యామల, టేస్టీ తేజ, రీతు చౌదరి, బండారు సుప్రీతలు ఉన్నారు. వీరు జంగిల్ రమ్మీ. కామ్, ఏ23, యోలో 247. కామ్, ఫేయిర్ ప్లే.లైవ్, జీత్ విన్, తాజ్ 77. ధనీబుక్365, మామా247. కో, తెలుగు365.ఇన్ వంటి బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నట్లుగా తెలిపారు.





**అనుమతి ఉన్న గేమ్స్ కే ప్రచారం : విజయ్ దేవరకొండ టీమ్**

కాగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ పై మియాపూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు కావడంతో నటుడు విజయ్ దేవరకొండ టీమ్ వివరణ ఇచ్చింది. చట్టప్రకారం అనుమతి ఉన్న గేమ్స్ కు మాత్రమే నటుడు విజయ్ దేవరకొండ ప్రచారం చేశారని తెలిపారు. అనుమతి ఉన్న ప్రాంతాల వరకే విజయ్ ప్రమోటర్ గా ఉన్నారని, రమ్మీ స్కిల్ బేస్డ్ గేమ్ అని సుప్రీంకోర్టు పలుమార్లు చెప్పిందని అన్నారు. ఏ23 సంస్థకు గతంలో విజయ్ ప్రచారకర్తగా పనిచేశారని, ప్రస్తుతం సదరు సంస్థతో విజయ్ కి ఎటువంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చింది. కేసు నమోదుపై నటుడు ప్రకాశ్ రాజ్ సైతం సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం తాను మాటింగ్ కోసం ఓ గ్రామానికి వచ్చానని, బెట్టింగ్ యాప్ ప్రమోషన్ పై కేసు నమోదు కావడం తెలిసి వివరణ ఇస్తున్నట్లు ప్రకాశ్ రాజ్ తెలిపారు. అందరినీ ప్రశ్నించే తాను ఈ విషయంలో సమాదానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 2016లో సదరు యాడ్ తనవద్దకు వస్తే చేశానని చెప్పారు. అది తప్పని కొద్దినెలల్లోనే తెలిసిందని అన్నారు. సంవత్సరం తరువాత అగ్రిమెంట్ పొడిగిస్తామని వాళ్లు వస్తే వద్దని చెప్పానని తెలిపారు. 2021లో సదరు కంపెనీ మరో కంపెనీకి అమ్మడం జరుగడంతో సోషల్ మీడియా వేదికలో తన యాడ్ మళ్లీ వచ్చిందన్నారు. దీనిపై అప్పుడే వాళ్లకు లీగల్ నోటీసు పంపించానని, వాళ్ళు సైతం సదరు యాడ్ ను అపేశారని అన్నారు. తాజాగా మరోసారి సదరు యాడ్ మీద చర్చ ప్రారంభమైందని అన్నారు. తనకు పోలీసుల నుంచి ఎటువంటి నోటీసులు అందలేదని తెలిపారు.




## బార్‌క్లేస్ బ్యాంక్ పెట్టుబడులు..
# రూ. 2,300 కోట్లకు రెడీ

**ముంబై:** దేశీ అనుబంధ సంస్థ బార్‌క్లేస్ బ్యాంక్ పీఎల్‌సీ ఇండియాకు బ్రిటిష్ మాతృ సంస్థ బార్‌క్లేస్ బ్యాంక్ రూ. 2,300 కోట్ల మూలధనం సమకూర్చనుంది. తద్వారా బ్యాంక్ బ్యాలన్స్‌షీట్ పటిష్ఠంకావడంతోపాటు ఇన్వెస్ట్‌మెంట్, ప్రయివేట్ బ్యాంకింగ్‌లో బిజినెస్ విస్తరించేందుకు సహాయపడనుంది.
దీంతో మరింతమంది క్లయింట్లకు బ్యాంక్ చేరువకానుంది. ప్రధానంగా కార్పొరేట్, ఫైనాన్షియల్ పెట్టుబడులున్న క్లయింట్లు, అత్యంత సంపన్న వర్గాలలో మరింత విస్తరించనున్నట్లు బార్‌క్లేస్ బ్యాంక్ ఒక ప్రకటనలో పేర్కొంది. వెరసి ప్రపంచంలోనే వేగవంత వృద్ధిలో ఉన్న ఆర్థిక వ్యవస్థ పట్ల దీర్ఘకాలిక కట్టుబాటును ప్రదర్శిస్తున్నట్లు తెలియజేసింది.

**బార్‌క్లేస్ ఇండియా ఆర్థిక పరిస్థితి**
ఇండియా రేటింగ్స్ ప్రకారం.. బార్‌క్లేస్ ఇండియా క్యాపిటల్ అడెక్వసీ రేషియో (సీఏఆర్) 2024 మార్చి చివరి నాటికి 15.93 శాతంగా ఉంది. బాసెల్3 మార్గదర్శకాల ప్రకారం బ్యాంకు కనీసం టైర్1 మూలధన నిష్పత్తిని 11 శాతంగా నిర్వహించాలి.
2024 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి భారత్‌లో కంపెనీ ఆస్తులు రూ.53,910 కోట్లుగా ఉన్నాయి. బార్‌క్లేస్ ఇండియా రుణాల్లో ఎక్కువ భాగం టర్మ్ లోన్స్ (2024 ఆర్థిక సంవత్సరంలో 49.2 శాతం), బిల్ డిస్కౌంటింగ్ (35.0 శాతం), వర్కింగ్ క్యాపిటల్ రుణాలు (15.8 శాతం) ఉన్నాయని ఇండియా రేటింగ్స్ తెలిపింది.



# రెండువారాల్లో 50000 బుకింగ్స్..
## ఈ స్కూటర్ కోసం ఎగబడుతున్న జనం

**అల్ట్రావయొలెట్ టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ ఇండియన్ మార్కెట్లో లాంచ్ అయిన.. రెండు వారాల్లోనే 50,000 బుకింగ్‌లను అందుకుంది. లాంచ్ సమయంలో ప్రకటించిన ధర మొదటి 10000 యూనిట్లకు మాత్రమే పరిమితం అని కంపెనీ వెల్లడించింది. కానీ ఈ ఆఫర్‌ను 50000 బుకింగ్‌లకు పొడిగించింది. మొత్తం బుకింగ్స్ దేశవ్యాప్తంగా ఉన్నాయి.**
రెండు వారాల క్రితం షాక్‌వేవ్ ఎలక్ట్రిక్ ఎండ్యూరో బైక్‌తో పాటు అల్ట్రావయొలెట్ టెస్సెరాక్ట్‌ను కూడా లాంచ్ అయింది. లాంచ్ సమయంలో, టెస్సెరాక్ట్‌ను రూ. 1.20 లక్షల ప్రారంభ ధరకు ఆవిష్కరించారు. ఈ ధర మొదటి 10,000 ప్రీ బుకింగ్‌లకు మాత్రమే చెల్లుతుందని బ్రాండ్ వెల్లడించింది. ఈ ప్రకటన తరువాత కేవలం 48 గంటల్లో 20,000 కంటే ఎక్కువ బుకింగ్‌లను పొందింది. దీంతో కంపెనీ ఈ ఆఫర్‌ను మరో 30,000 ప్రీబుకింగ్‌లకు విస్తరిస్తున్నట్లు నిర్ణయించింది.
అల్ట్రావయొలెట్ టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్ డెలివరీలు 2026 మొదటి త్రైమాసికంలో ప్రారంభమవుతాయి. ఇది ఒక ఫుల్ ఛార్జితో 261 కిమీ రేంజ్ అందిస్తుందని తెలుస్తోంది. కేవలం 100 రూపాయలతో రెండుసార్లు ఛార్జ్ చేయడం ద్వారా 500 కిలోమీటర్ల పరిధిని సాధించగలదని అల్ట్రావయొలెట్ పేర్కొంది.
టెస్సెరాక్ట్ ఎలక్ట్రిక్ స్కూటర్.. ఆన్‌బోర్డ్ నావిగేషన్‌తో కూడిన 7 ఇంచెస్ టచ్‌స్క్రీన్ TFT ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, రెండు డాష్‌క్యామ్‌లు (ముందు, వెనుక), వైర్‌లెస్ ఛార్జింగ్, హ్యాండిల్‌బార్ కోసం హాప్టిక్ ఫీడ్‌బ్యాక్, డ్యూయల్ ఛానల్ ఏబీఎస్, డ్యూయల్ డిస్క్‌లు, ట్రాక్షన్ కంట్రోల్, హిల్ హోల్డ్, డైనమిక్ స్టెబిలిటీ కంట్రోల్ వంటివి పొందుతుంది.
టెస్సెరాక్ట్ అనేది రాడార్ బేస్డ్ ADAS టెక్నాలజీతో కూడిన భారతదేశపు మొట్టమొదటి స్కూటర్. ఇది బ్లైండ్ స్పాట్ డిటెక్షన్, ఓవర్‌టేక్ అలర్ట్, కొలిజన్ అలర్ట్, లేన్ చేంజ్ అసిస్ట్ వంటి ఫీచర్స్ పొందుతుంది. ఈ స్కూటర్ ఫ్లోటింగ్ డీఆర్ఎల్, ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌లతో కూడిన డ్యూయల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ ల్యాంప్ పొందుతుంది. దీని అండర్ సీట్ స్టోరేజ్ 34 లీటర్లు.

# కొత్త రేటుకు చేరిన బంగారం

**దేశంలో బంగారం ధరలు వరుసగా పెరుగుదలవైపే దూసుకెళ్తున్నాయి. మూడో రోజు కూడా గోల్డ్ రేటు గరిష్ఠంగా రూ. 220 పెరిగింది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా పసిడి ధరలలో మార్పులు జరిగాయి. ఈ కథనంలో ఏ ప్రాంతంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయనే వివరాలను తెలుసుకుందాం.**

హైదరాబాద్, విజయవాడలలో 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 83,100 వద్ద, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 90,660 వద్ద నిలిచాయి. నిన్న రూ. 400, రూ. 440 పెరిగిన గోల్డ్ రేటు.. ఈ రోజు రూ. 200 (22 క్యారెట్స్ 10గ్రా), రూ.220 (24 క్యారెట్స్ 10గ్రా) పెరిగింది. ఇదే ధరలు గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో కూడా కొనసాగుతాయి.

చైన్నైలో కూడా బంగారం ధరలు వరుసగా రూ. 200, రూ. 220 పెరిగింది. దీంతో ఇక్కడ 10గ్రా 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 83,100 వద్ద, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 90,660 వద్ద ఉంది.
దేశ రాజధాని నగరంలో పసిడి ధరలు రూ. 83,250 (10గ్రా 22 క్యారెట్స్), రూ. 90,810 (10గ్రా 24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. నిన్నటి ధరలతో పోలిస్తే.. ఈ రోజు ధరలు వరుసగా రూ. 200, రూ. 220 ఎక్కువ. అంతే కాకుండా.. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే.. ఢిల్లీలో గోల్డ్ రేటు ఎక్కువగానే ఉంది.
వెండి ధరలు



**బంగారం ధరలు మాదిరిగానే.. వెండి ధరలు స్వల్ప పెరుగుదలను నమోదు చేశాయి. ఈ రోజు (మార్చి 16) కేజీ సిల్వర్ రేటు రూ. 1,14,100 చేరింది. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో వెండి ధరలు ఒకేవిధంగా ఉన్నప్పటికీ.. ఢిల్లీలో మాత్రం కేజీ వెండి రేటు రూ. 1,05,100 వద్దకు చేరింది.**

## మైక్రోసాఫ్ట్‌లో కీలక మార్పు..
### ఉద్యోగులకు సత్య నాదెళ్ల లేఖలు

ప్రపంచ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ హెచ్‌ఆర్ విభాగంలో కీలక మార్పులు చేసింది. కాథ్లీన్ హొగన్ స్థానంలో అమీ కోల్‌మన్‌ను కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్‌గా నియమిస్తున్నట్లు మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ సత్య నాదెళ్ల నేరుగా ఉద్యోగులకు ఈమెయిల్ లేఖలు పంపించారు.దశాబ్దానికి పైగా మైక్రోసాఫ్ట్ చీఫ్ పీపుల్ ఆఫీసర్‌గా సేవలందించిన హొగన్ "ఆఫీస్ ఆఫ్ స్ట్రాటజీ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్" ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కానున్నారు. నేరుగా సీఈవో సత్య నాదెళ్లకు రిపోర్ట్ చేసే ఈ హోదాను కొత్తగా సృష్టించారు. చీఫ్ పీపుల్ ఆఫీసర్ గా మైక్రోసాఫ్ట్ పై కాథ్లీన్ చూపిన ప్రభావాన్ని అతిశయోక్తిగా చెప్పలేమని సత్య నాదెళ్ల ఉద్యోగులకు పంపిన ఈమెయిల్ లో పేర్కొన్నారు."గత పదేళ్లకు పైగా ఆమె మన సాంస్కృతిక పరివర్తనకు నాయకత్వం వహించారు. వృద్ధి మనస్తత్వాన్ని స్వీకరించి చురుకుదనంతో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడానికి, ప్రపంచ స్థాయి ప్రతిభను ఆకర్షించడానికి, నిలుపుకోవటానికి ఇది మనకు దోహదపడింది" అంటూ సత్య నాదెళ్ల ప్రశంసించారు.

# ఫెడ్ వడ్డీ రేట్లు యథాతథం

**4.25–4.5 శాతం వద్దే ఫండ్స్ రేట్లు**
తాజా పాలసీ సమీక్షలో యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించేందుకే నిర్ణయించింది. దీంతో ఫెడ్ ఫండ్స్ రేట్లు మరోసారి 4.25-4.5 శాతంవద్దే కొనసాగనున్నాయి. ఛైర్మన్ జెరోమ్ పావెల్ అధ్యక్షతన రెండు రోజులపాటు సమావేశమైన ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ(ఎఫ్‌వోఎంసీ) గత సమీక్షలోనూ యథాతథ పాలసీ అమలుకే ఓటు వేసిన సంగతి తెలిసిందే.



భారతదేశంలో ఆర్‌బీఐ గత మానిటరీ పాలసీ సమావేశంలో ఐదేళ్లలో మొదటిసారి రేటు తగ్గింపును అమలు చేసింది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి చేర్చింది. ద్రవ్యోల్బణాన్ని ఆర్థిక వృద్ధితో సమతుల్యం చేయడమే ఈ చర్య లక్ష్యంగా తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య విధానాలు తరచూ భారత్ వంటి వర్ధమాన మార్కెట్లపై ఒత్తిడి పెంచుతున్నా స్థానికంగా ఆర్‌బీఐ నిర్ణయాలు కీలకంగా మారుతున్నాయి. ఫెడ్ తాజా నిర్ణయాల నేపథ్యంలో ఏప్రిల్ 79 వరకు జరిగే ఆర్‌బీఐ మానిటరీ పాలసీ సమావేశంలో ఏమేరకు వడ్డీరేట్లపై చర్యలు తీసుకొంటారో మార్కెట్ వర్గాలు పరిశీలించే అవకాశం ఉంది.

**వివిధ దేశాలపై ప్రెసిడెంట్ ట్రంప్ ప్రతీకార టారిఫ్‌ల విధింపు, వీటి కారణంగా యూఎస్‌లో స్టాగ్‌ఫ్లేషన్ పరిస్థితులు తలెత్తనున్నట్లు ఆర్థికవేత్తల అంచనాల నడుమ ఎఫ్‌వోఎంసీ ఆచితూచి అడుగేస్తున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దీంతో ఫెడ్ నిర్ణయాల తదుపరి ఛైర్మన్ పావెల్ ప్రసంగంపై ప్రపంచ కేంద్ర బ్యాంకులు దృష్టిపెట్టనున్నట్లు తెలియజేశారు. అయితే ఆర్థికవేత్తలు ఊహిస్తున్నట్లు 2025లో వడ్డీ రేట్ల కోతలపై ఫెడ్ నుంచి స్పష్టమైన సంకేతాలు వెలువడకపోవచ్చని అభిప్రాయపడ్డారు.**

## భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు..
# ఎయిర్‌టెల్ మెరుపులు

**బెంచ్ మార్క్ భారతీయ ఈక్విటీ సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. వివిధ రంగాలలో కొనుగోళ్లకు దారితీయడంతో 1 శాతానికి పైగా లాభపడ్డాయి. 30 షేర్ల సెన్సెక్స్ 899.01 పాయింట్లు లేదా 1.19 శాతం పెరిగి 76,348.06 వద్ద స్థిరపడింది. ఈ సూచీ ఈరోజు 76,456.25-75,684.58 రేంజ్‌లో ట్రేడ్ అయింది.**

ఇక నిఫ్టీ 50 కూడా 283.05 పాయింట్లు (1.24 శాతం) పెరిగి 23,190.65 వద్ద ముగిసింది. ఈ ఇండెక్స్ 23,216.70 వద్ద రోజు గరిష్ఠాన్ని, 22,973.95 వద్ద కనిష్ఠాన్ని తాకింది. విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.64 శాతం, 0.70 శాతం లాభపడ్డాయి.







**ఎన్ఎస్ఈలోని అన్ని సెక్టోరల్ ఇండెక్స్‌లు ముగిశాయి. నిఫ్టీ ఐటీ, ఆటో, ఎఫ్ఎంసీజీ, మెటల్, మీడియా, రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్ ఇండెక్స్‌లు 1 శాతానికి పైగా లాభపడ్డాయి.**

సెన్సెక్స్ లోని 30 షేర్లలో ఈ రోజు కేవలం మూడు మాత్రమే నష్టాలను చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్ 4 శాతం లాభంలో టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్, నెస్లే ఇండియా, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు కూడా రాణించాయి. భారతీ ఎయిర్ టెల్ షేర్లు నిఫ్టీలోనూ మెరుపులు మెరిపించింది. నిఫ్టీ 50 షేర్లలో 4 మాత్రమే నష్టాలను చూశాయి.





# నా హృదయం సంతోషంతో నిండిపోయింది- మెగాస్టార్



యూకే పార్లమెంట్‌లో తనకు జరిగిన సన్మానంపై మెగాస్టార్ చిరంజీవి ట్వీట్ చేశారు. చాలా మంది గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యులు, మంత్రులు, సెక్రటరీలు, దౌత్యవేత్తలు సమక్షంలో అందుకున్న గౌరవంతో నా మనసు నిండిపోయిందని పోస్ట్ చేశారు. టీమ్ బ్రిడ్జ్ ఇండియా ద్వారా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించడంతో మనస్ఫూర్తిగా సంతోషాన్ని ఇచ్చిందని రాసుకొచ్చారు. మెగాస్టార్ తన ట్వీట్‌లో రాస్తూ..' నాకు దక్కిన ఈ గౌరవం గురించి చెప్పాలంటే మాటలు చాలవు. కానీ నా అద్భుతమైన ప్రేమగల అభిమానులకు, నా సోదర, సోదరిమణులకు, నా కుటుంబం, శ్రేయోభిలాషులు, స్నేహితులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు. నా ప్రయాణానికి నాకు అన్ని విధాలుగా సహకరించి.. నా మానవతా కార్యక్రమాలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ గౌరవం నన్ను మరింత కష్టపడేందుకు ప్రేరేపిస్తుంది. నాకు మరింత శక్తిని అందిస్తోంది' అంటూ పోస్ట్ చేశారు. ఇక సినిమాల విషయానికొస్తే మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం విశ్వంభర చిత్రంలో నటిస్తున్నారు. ఈ సోషియో ఫాంటసీ యాక్షన్ చిత్రానికి బింబిసార ఫేమ్ వశిష్ట దర్శకత్వం వహిస్తున్నారు.

# నవ్వించడానికి చేసిన సినిమా ఇది



**"మా కథకి పర్ఫెక్ట్ టైటిల్ 'పెళ్లి కాని ప్రసాద్'. ఈ పేరు డైరెక్టర్ అభిలాష్ ఫిక్స్ చేశారు. ఆ టైటిల్ వెయిట్‌ని కాపాడేలా మా సినిమా ఉంటుంది. వినోదం చాలా అద్భుతంగా కుదిరింది. ప్రమోషన్స్‌కి వెళ్లినప్పుడు ఇప్పటికే కొంతమంది నన్ను 'పెళ్లి కాని ప్రసాద్' అని పిలుస్తున్నారు. అందరూ అలా పిలిస్తే మా సినిమా ప్రేక్షకులకు బాగా చేరువ అయినట్టే. అంతకంటే ఆనందం ఏముంటుంది" అని సప్తగిరి తెలిపారు. అభిలాష్ రెడ్డి గోపిడి దర్శకత్వంలో సప్తగిరి, ప్రియాంకా శర్మ జోడీగా నటించిన చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'.**

చాగంటి సినిమాటిక్ వరల్డ్ సమర్పణలో కేవై బాబు, భానుప్రకాశ్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్ రెడ్డి ముత్యాల నిర్మించారు. నిర్మాత 'దిల్' రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రేపు (శుక్రవారం) ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా సప్తగిరి మాట్లాడుతూ– ''వెంకటేశ్‌గారి కెరీర్‌లో ఐకానిక్ క్యారెక్టర్ పెళ్లి కాని ప్రసాద్ ('మల్లీశ్వరి' చిత్రంలో). ఆయన పాత్రతో నా పాత్రని ఏ మాత్రంపోల్చుకోను.

మా సినిమా ట్రైలర్ వెంకటేశ్‌గారు విడుదల చేసి.. 'కంటెంట్ చాలా పాజిటివ్‌గా ఉంది.. సినిమా హిట్ సాధించాలి' అని ఆశీర్వదించారు. మా సినిమాకి సపోర్ట్ చేసిన హీరోలు ప్రభాస్, వెంకటేశ్, దర్శకులు మారుతి, అనిల్ రావిపూడి, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ గార్లకు కృతజ్ఞతలు. ఈ మూవీలో ఎలాంటి సందేశం లేదు.. ప్రేక్షకులను నవ్వించడానికి చేసిన సినిమా.

ఫైనల్ ఔట్‌పుట్ చూశాక మా నిర్మాతలూ సినిమా విజయంపై నమ్మకంగా ఉన్నారు. శేఖర్ చంద్ర మ్యూజిక్, నేపథ్య సంగీతం బాగుంటుంది. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కొన్ని సినిమాలు చేస్తున్నాను. హీరోగా కూడా కొన్ని కథలు విన్నాను'' అని చేపారు.



# రెమ్యునరేషన్ మోడల్‌ను మార్చేసిన ఫస్ట్ హీరో 'మహేష్‌బాబు'..

**స్టార్ హీరోలు ఒక్కో సినిమాకు ఎంత రెమ్యునరేషన్ తీసుకుంటారు అనేది ఇచ్చే నిర్మాతలకు, తీసుకునే హీరోలకు తప్ప ఎవరికీ తెలియదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం వీరి పారితోషికానికి సంబంధించిన గాసిప్స్ చక్కర్లు కొడుతూనే ఉంటాయి. కానీ, సినిమా హిట్ అయితే నిర్మాతకు భారీగానే లాభాలు వస్తాయి. ఒకవేళ నష్టం వస్తే కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ప్రస్తుతం హీరోల అధిక రెమ్యునరేషన్‌లు చిత్ర పరిశ్రమ మనుగడకు ఇబ్బందిగా మారుతోందని పలువురు బహిరంగంగానే కామెంట్ చేస్తున్నారు. అధిక నష్టాల ఎఫెక్ట్ వల్ల కొత్తగా నిర్మాతలు ఎవరూ కూడా సినీ పరిశ్రమలో అడుగుపెట్టేందుకు ఆసక్తి చూపడం లేదు.**

రీసెంట్‌గా తీరని నష్టాల వల్ల లైకా ప్రొడక్షన్స్ సంస్థను షట్‌డౌన్ చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. దీనంతటికీ కారణం సినిమా బడ్జెట్ పెరగడమే అని చెప్పవచ్చు. అందులో అధిక భాగం హీరో రెమ్యునరేషన్ అనే ఎక్కువమంది చెబుతున్న మాట. అయితే, ఈ రెమ్యూనరేషన్ మోడల్ మొత్తంగా మహేష్‌బాబు మార్చేశారని ఇండస్ట్రీలో వినిపిస్తోంది. అయితే, అది నిర్మాతలకు భారీ ఊరటను కల్పించేలా ఉండటంతో ప్రిన్స్ మహేష్ బాబును అభినందిస్తున్నారు.

**నష్టం వస్తే జీరో రెమ్యునరేషన్**

దేశంలో అత్యధిక రెమ్యునరేషన్ అందుకున్న హీరోగా అల్లు అర్జున్ రూ. 300 కోట్లతో (పుష్ప2) టాప్‌లో ఉన్నారు. అయితే, పుష్ప2 మూవీకి భారీ లాభాలు వచ్చాయి కాబట్టి సరిపోయింది. ఒకవేళ రిజల్ట్‌లో తేడా వచ్చింటే ఎవరూ ఊహించలేని నష్టాలను ఆ చిత్ర నిర్మాణ సంస్థ భరించాల్సి వచ్చిండేది. ఇప్పుడు మహేష్‌బాబు రాజమౌళి (SSMB29) ప్రాజెక్ట్ కోసం సుమారు రూ. 1000 కోట్లు బడ్జెట్ పెడుతున్నారని వార్తలు వచ్చాయి. అయితే, ఈ మూవీ కోసం మహేష్‌బాబు తన రెమ్యునరేషన్‌గా సినిమాకు ఫైనల్‌గా వచ్చిన లాభాల్లో షేర్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అది కూడా లాభాల్లో 35 శాతం వరకు ఉండొచ్చని సమాచారం. ఈ వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో గట్టిగానే వైరల్ అవుతుంది.

సినిమాకు నష్టాలు వస్తే జీరో రెమ్యనరేషన్ అని ముందే డీల్ సెట్ చేసుకున్నారట.. ఇదే ప్లాన్‌ను దర్శకులు రాజమౌళి కూడా అనుసరిస్తున్నారట. అసలు రెమ్యూనరేషన్ అంటూ తీసుకోకుండా కేవలం వచ్చే ప్రాఫిట్‌లో షేర్ తీసుకోవడం నిర్మాతలకు భారీ ఊరట కల్పించే అంశమని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నాయి. భవిష్యత్‌లో ఇదే దారిలో చాలామంది హీరోలు వెళ్లే అవకాశం ఉంది. రెమ్యునరేషన్ విషయంలో ట్రెండ్ సెట్ చేసిన హీరోగా మహేష్ రికార్డ్ క్రియేట్ చేశారని చెప్పవచ్చు.

# సీనియర్ హీరోతో 'మమితా బైజు' రొమాన్స్



**కాలాల మాదిరి హీరోయిన్లకు ఒక సీజన్ ఉంటుందనిపిస్తోంది. తెలుగు పరిశ్రమలో మాదిరే కోలీవుడ్‌లో కూడా ఇప్పుడు యువ హీరోయిన్ల సీజన్ నడుస్తోందనే చెప్పవచ్చు. ప్రేమలు చిత్రానికి ముందు మమితా బైజూ చిన్న చిన్న పాత్రల్లోనే నటించింది. ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది మాత్రం ప్రేమలు చిత్రమే. ఆ చిత్రం తరువాత కోలీవుడ్, టాలీవుడ్‌ల్లో అవకాశాలు తలుపు తడుతున్నాయి. అలా జీవీ.ప్రకాశ్‌కుమార్‌కు జంటగా రెబల్ చిత్రం ద్వారా కోలీవుడ్‌కు నాయకిగా ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రం నిరాశపరిచినా, ప్రస్తుతం విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న జననాయకన్ చిత్రంలో కీలక పాత్రను పోషిస్తోంది. అదేవిధంగా విష్ణువిశాల్‌కు జంటగా ఇరండు వానం చిత్రంలో నటిస్తోంది. అదేవిధంగా డ్రాగన్ చిత్ర హీరో ప్రదీప్ రంగనాథన్ సరసన ఒక చిత్రంలో నటించే అవకాశం ఈ అమ్మడి తలుపు తట్టినట్లు సమాచారం. కాగా తాజాగా ధనుష్‌తో రొమాన్స్ చేసే లక్కీచాన్స్ మమితా బైజూను వరించినట్లు తెలిసింది. కథానాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా సక్సెస్ బాటలో పయనిస్తున్న నటుడు ధనుష్. కాగా ప్రస్తుతం ఇడ్లీ కడై చిత్రంలో కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో నటిస్తున్న కుబేర చిత్రం సమ్మర్ స్పెషల్‌గా తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఇందులో నాగార్జున ప్రధాన పాత్రను పోషించగా, రష్మిక మందన్నా నాయకిగా నటించారు.**

**ఒక హిందీ చిత్రంలో నటిస్తున్న ధనుష్ మరో తమిళ చిత్రానికి పచ్చజెండా ఊపినట్లు సమాచారం. దీన్ని పోర్ తొళిల్ చిత్రం ఫేమ్ విఘ్నేశ్ రాజా దర్శకత్వం వహించినున్నారని, ఈ క్రేజీ భారీ యాక్షన్ ఎంటర్‌టెయినర్ కథా చిత్రాన్ని డా.ఐసరి గణేశ్ తన వేల్స్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో కథానాయకుడికి దీటుగా కథానాయకి పాత్ర ఉంటుందని, ఈ పాత్రకు నటి మమితాబైజూను ఎంపిక చేసినట్లు ప్రచారం సామాజక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం**



# అలాంటి యాప్‌లనే ప్రమోట్ చేశారు.. రానా టీమ్ క్లారిటీ

**టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటిపై వస్తున్న ప్రచారంపై ఆయన టీమ్ స్పందించింది. బెట్టింగ్ యాప్ వ్యవహారంలో రానాపై కూడా కేసు నమోదైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా రానా పీఆర్ టీమ్ క్లారిటీ ఇచ్చింది. స్కిల్ ఆధారిత గేమ్‌లకు బ్రాండ్ అంబాసిడర్‌గా రానా దగ్గుబాటి ఒక కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపింది. అయితే ఈ అగ్రిమెంట్ 2017లోనే ముగిసిందని వెల్లడించింది. కేవలం చట్టబద్ధమైన కంపెనీలకే రానా ప్రమోట్ చేశారని పీఆర్ రిలీజ్ చేసిన ప్రకటనలో పేర్కొంది**

**ఏదైనా ఒప్పందాలు చేసుకునే ముందు రానా దగ్గుబాటి న్యాయ బృందం అన్నింటినీ క్షుణ్ణంగా సమీక్షిస్తుందని వివరించారు. చట్టపరంగా అనుగుణంగా ఉంటేనే రానా అంగీకరిస్తారని తెలిపారు. రానా దగ్గుబాటి ప్రమోట్ చేసిన యాప్ చట్టానికి పూర్తిగా అనుగుణంగా ఉందని చెప్పడానికే ఈ ప్రెస్ నోట్ జారీ చేశామని వెల్లడించారు. జూదానికి వ్యతిరేకంగా భారత సుప్రీంకోర్టు గుర్తించిన ఈ ఆన్‌లైన్ గేమ్‌లను హైలైట్ చేయడం చాలా అవసరమని.. ఇలాంటి గేమ్‌లు నైపుణ్యం మీద ఆధారపడి ఉన్నాయని.. అందువల్ల చట్టబద్ధంగా వీటిని అనుమతించారని గతంలో కోర్టు తీర్పు ఇచ్చిందని నోట్‌లో ప్రస్తావించారు.**

**బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేశారంటూ ఇప్పటికే పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్స్, యూట్యూబర్స్‌తో పాటు పలువురు బుల్లితెర నటీనటులపై పంజాగుట్ట, మియాపూర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే పలువురు పోలీసుల ముందు విచారణకు హాజరయ్యారు. విష్ణు ప్రియతో పాటు రీతూ చౌదరి పంజాగుట్ట పీఎస్‌లో పోలీసులకు వివరణ ఇచ్చారు.**

# బీసీసీఐ కీలక నిర్ణయం..
# బౌలర్లకు పండగే?

**ఐపీఎల్-2025కు ముందు భారత క్రికెట్ బోర్డు (బీసీసీఐ) ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో బంతులపై లాలాజలం(సలైవా) వాడకంపై నిషేధాన్ని బీసీసీఐ ఎత్తివేసింది. గురువారం(మార్చి 20) జరిగిన కెప్టెన్ల సమావేశం అనంతరం బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ముంబైలో జరిగిన ఈమీట్‌లో ఎక్కువ మంది కెప్టెన్‌లు సలైవా ఉపయోగించాలనే ఆలోచనకు అంగీకరించారు.**

ఈ ఏడాది సీజన్ నుంచే ఈ రూల్ అమలులోకి రానుంది. కాగా ఇదే విషయంపై బీసీసీఐ పెద్దలు ఇప్పటికే ఐపీఎల్ జట్ల కెప్టెన్‌లతో అంతర్గతంగా చర్చించారు. తుది నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత కెప్టెన్లకే బోర్డు విడిచిపెట్టింది. ఇప్పుడు అందుకు కెప్టెన్‌లు కూడా అంగీకరించడంతో బీసీసీఐ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

"ఇది కెప్టెన్‌లు ఇష్టం. సలైవా వాడకాన్ని వారు కొనసాగించాలనకుంటే, మాకు ఎటువంటి సమస్య లేదు. మేము దానికి అంగీకరిస్తున్నాము. అయితే అంతర్జాతీయ మ్యాచ్‌ల సమయంలో మాత్రం ఐసీసీ రూల్‌కు కట్టుబడి ఉంటాము" అని బీసీసీఐ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

**2020లో బ్యాన్..**

కోవిడ్ 19 మహమ్మారి తర్వాత.. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ లాలాజల వాడకాన్ని నిషేధించింది. దీంతో



**ఐపీఎల్(2020)లో సైతం బీసీసీఐ సైతం లాలాజల వాడకంపై బ్యాన్ విధించింది. అప్పటి నుంచి గతసీజన్ వరకు ఏ ఫాస్ట్ బౌలర్, ఏ ప్లేయర్ కూడా సలైవాను ఉపయోగించలేదు. తాజాగా ఇదే విషయంపై భారత ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కూడా స్పందించాడు. లాలాజల వాడకంపై బ్యాన్‌ను ఎత్తివేయాలని ఐసీసీని షమీ అభ్యర్థించాడు**

ఫాస్ట్ బౌలర్లు బంతిని రివర్స్ స్వింగ్‌ను చేయడానికి కాస్త ఇబ్బంది పడ్డారు. బంతిపై సలైవా ఉపయోగించితే అది ఎక్కువగా రివర్స్ స్వింగ్ అవుతుంది.

"మేము రివర్స్ స్వింగ్ చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాము. కానీ సలైవాను మాత్రం ఉపయోగించడం లేదు. మ్యాచ్ జరిగే సమయంలో సలైవా వాడకాన్ని అనుమతించమని మేము చాలా సార్లు ఐసీసీకి విజ్ఞప్తి చేశాము. అందుకు అనుమతి ఇస్తే బంతి మరింత ఎక్కువగా రివర్స్ సింగ్ అయ్యే అవకాశముంటుంది" అని ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా విలేకరుల సమావేశంలో షమీ పేర్కొన్నాడు.

కాగా ఐపీఎల్2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి.



## ఒక్కో ఆటగాడికి రూ. 3 కోట్లు..
## గంభీర్‌కు ఎంతో వెల్లడించిన బీసీసీఐ

**టీమిండియాకు ప్రకటించిన నగదు బహుమతి పంపిణీ అంశంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. ఆటగాళ్లకు, కోచ్‌లకు, సహాయక సిబ్బందికి ఇచ్చే మొత్తం ఎంతన్నది తాజాగా వెల్లడించారు. చాంపియన్స్ ట్రోఫీ జట్టులోని ప్రతి ఆటగాడికి రూ. 3 కోట్ల మేర అందజేయనున్నట్లు తెలిపారు.**

కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ2025 లో టీమిండియా విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. గ్రూప్ దశలో మూడింటికి మూడు గెలిచిన రోహిత్ సేన.. సెమీస్‌లో ఆస్ట్రేలియాపై, ఫైనల్లో న్యూజిలాండ్‌పై విజయం సాధించి టైటిల్ సొంతం చేసుకుంది. ఐదు మ్యాచ్‌లలో అజేయంగా నిలిచి తొమ్మిది నెలల వ్యవధిలోనే మరో ఐసీసీ ట్రోఫీని సాధించింది.

ఈ నేపథ్యంలో బీసీసీఐ భారత జట్టుకు భారీ క్యాష్ రివార్డు ప్రకటించింది. రూ. 58 కోట్ల నజరానా ఇవ్వనున్నట్లు గురువారం వెల్లడించింది. అయితే, ఇందులో ఎవరెవరికి ఎంత మొత్తం ఇస్తారన్న విషయం గురించి కార్యదర్శి దేవజిత్ సైకియా తాజాగా వెల్లడించారు.

**గౌతం గంభీర్‌కు మూడు కోట్లు**

వార్తా సంస్థ ఏఎన్ఐతో మాట్లాడుతూ.. ''జట్టులోని ప్రతి ఆటగాడికి రూ. 3 కోట్లు.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌కు మూడు కోట్లు.. మిగిలిన కోచ్‌లలో అసిస్టెంట్లు ర్యాన్ టెన్ డస్కాటే, అభిషేక్ నాయర్, బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్, బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్, ఫీల్డింగ్ కోచ్‌కు టి. దిలీప్‌నకు రూ. 50 లక్షలు.. మిగిలిన సహాయక సిబ్బందికి రూ. యాభై లక్షలు.. బీసీసీఐ అధికారులకు రూ. 25 లక్షలు ఇస్తాం'' అని దేవజిత్ సైకియా తెలిపారు.

కాగా సొంతగడ్డపై వన్డే వరల్డ్‌కప్2023లో ఫైనల్ వరకు అజేయంగా నిలిచిన.. ఆఖరి మెట్టుపై బోల్తా పడింది. ఆస్ట్రేలియాతో చేతిలో ఓటమి పాలై టైటిల్‌ను చేజార్చుకుంది. అయితే, టీ20 ప్రపంచకప్2024తో ఈ గాయాలను మాన్పివేసింది. అమెరికా వెస్టిండీస్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన ఈ మెగా టోర్నీలో ఆఖరి వరకు ఓటమన్నదే లేక చాంపియన్‌గా నిలిచింది.

**దుబాయ్‌లోనే అన్ని మ్యాచ్‌లు**

తొమ్మిది నెలల అనంతరం తాజాగా చాంపియన్స్ ట్రోఫీలోనూ అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. ఈ వన్డే టోర్నమెంట్‌కు పాకిస్తాన్ ఆతిథ్య దేశంగా వ్యవహరించిగా.. భద్రతా కారణాల వల్ల టీమిండియాను అక్కడకు పంపేందుకు బీసీసీఐ నిరాకరించింది.

ఈ క్రమంలో ఐసీసీ జోక్యంతో దుబాయ్‌లో భారత జట్టు తమ మ్యాచ్‌లన్నీ ఆడేలా హైబ్రిడ్ మోడల్‌కు పాక్ అంగీకరించింది. ఇక ఒకే వేదిక మీద అన్ని మ్యాచ్‌లు ఆడటం వల్ల టీమిండియాకు మిగతా జట్లతో పోలిస్తే.. అదనపు ప్రయోజనాలు చేకూరాయని ఇంగ్లండ్, సౌతాఫ్రికా మాజీ క్రికెటర్లు విమర్శించారు. అయితే, భారత జట్టు ఎంతో పటిష్టంగా ఉందని.. వేదిక ఏదైనా గెలుపు టీమిండియాదేనంటూ సునిల్ గావస్కర్ వంటి దిగ్గజాలు ఆ విమర్శలను తిప్పికొట్టారు. టీ20 ప్రపంచకప్2024లో మిగతా జట్ల మాదిరే టీమిండియా కూడా ప్రయాణాలు చేసిందని.. అయినా విజేతగా నిలిచిందంటూ కౌంటర్ ఇచ్చారు.

**ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025లో పాల్గొన్న భారత జట్టు**

రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, మహమ్మద్ షమీ, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, రిషభ్ పంత్.

**సహాయక సిబ్బంది:**

హెడ్‌కోచ్ గౌతం గంభీర్, కోచ్‌లు అభిషేక్ నాయర్, ర్యాన్ టెన్ డస్కాటే, టి. దిలీప్, మోర్నీ మోర్కెల్.

## హార్దిక్ మానసిక క్షోభ అనుభవించాడు..
## బయోపిక్ తీయొచ్చు: కైఫ్



**గతేడాది ఐపీఎల్ సమయంలో అతడు మైదానంలో కనబడితే చాలు సొంత జట్టు అభిమానులే తీవ్రస్థాయిలో ఒకటే హేళనలు. కానీ, ఇప్పుడు అతడే హీరోగా మారిపోయాడు.**

సరిగ్గా ఏడాది కిందట గత ఐపీఎల్ సందర్భంగా భారత క్రికెటర్ హార్దిక్ పాండ్య పై తీవ్ర విమర్శలు రేగాయి. తమ అభిమాన క్రికెటర్ రోహిత్‌ను కాదని.. ముంబయి ఇండియన్స్ సారథ్య బాధ్యతలను పాండ్యకు అప్పగించడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచుల సమయంలో హార్దిక్‌ను హేళన చేస్తూ కవ్వించారు. అయినా, ఎక్కడా నోరు జారకుండా ముందుకుసాగాడు. తన ఆటతీరుతోనే టీమ్‌ఇండియాలో తానెంత కీలక ఆటగాడినో నిరూపించాడు. విమర్శలు చేసినవారే ప్రశంసించేలా పాండ్య ఎదిగాడు. ముంబయి జట్టు తరఫున హార్దిక్ పాండ్య ప్రెస్ కాన్ఫరెన్స్‌లోనూ చాలా హుందాగా మాట్లాడాడు. ఒక్క ఏడాదిలోనే రెండు దశలను చూసిన పాండ్య జీవితాన్ని తప్పకుండా బయోపిక్ లేదా డాక్యుమెంటరీ తీయొచ్చని భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ వ్యాఖ్యానించాడు.

**పాండ్యతో జాగ్రత్త..**

''ఐపీఎల్ 2025 (IPL 2025) సీజన్‌లో హార్దిక్ పాండ్యతో ప్రత్యర్థులు జాగ్రత్తగా ఉండాలి. తప్పకుండా ముంబయి టాప్ 4లోకి వస్తుంది. అభిమానులు మళ్లీ పాండ్యకు సపోర్ట్ ఇవ్వాలి. రోహిత్ అతడికి అండగా నిలవాలి. పాండ్య తన పేలవ దశ నుంచి బయటపడ్డాడు. భారత్ రెండు కప్‌లను సాధించడంలోనూ కీలక పాత్ర పోషించాడు. కష్టాలను ఎదురొడ్డి పోరాడటం నిజంగా అభినందనీయం'' అని కైఫ్ ప్రశంసించాడు.

**ముంబయి సిక్సర్ కొట్టేయాలని..**

''ఎంత బాధ కలిగినా దానిని తనలోనే ఉంచుకొన్నాడు. బయట ఏమనుకున్నా పట్టించుకోకుండా ముందుకుసాగాడు. గొప్పగా సత్తా చాటి కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఈ క్రమంలో కొన్ని రోజులు అతడి ప్రయాణం దారుణంగా ఉంది. ప్రేక్షకుల నుంచి హేళనలు ఎదుర్కొన్నాడు. అతడిని తక్కువ చేసి సోషల్ మీడియాలో తమకు ఇష్టం వచ్చినట్లు రాసేశారు. ఎన్నో అవమానాలు బాధించినా ప్లేయర్‌గా ముందుకుసాగాడు. ఆటగాడు ఎప్పుడూ వాటిని మరిచిపోలేదు. అతడిని పక్కనపెట్టినా ఫర్వాలేదు. కానీ, అవమానించడం మాత్రం సరైంది కాదు. మానసికంగా చాలా క్షోభ అనుభవించాడు. అలాంటి పరిస్థితుల్లోనూ టీ20 ప్రపంచకప్‌లో సత్తా చాటాడు. ఫైనల్‌లో దక్షిణాఫ్రికా డేంజరస్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్‌ను ఔట్ చేశాడు. ఇక ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ ఫైనల్‌లో జంపా బౌలింగ్‌లో కొట్టిన రెండు సిక్స్‌లు ఎంత విలువైనవో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. బ్యాట్‌తోపాటు బంతితోనూ సింహంలా పోరాడాడు. అతడిపై ఏదైనా బయోపిక్ తీయాలనుకుంటే మాత్రం గత ఏడు నెలలు ఒకెత్తు.. అంతకుముందు ఐపీఎల్ (IPL) సమయంలో జరిగిన సంఘటనలు మరో ఎత్తు. తన బలాలను నమ్ముకొని నిశ్శబ్దంగా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు'' అని కైఫ్ వెల్లడించాడు.



## ఐపీఎల్ 18 సందడి షురూ..
### ఒక్కచోట చేరి ఫొటోలకు పోజులిచ్చిన కెప్టెన్లు

మరో రెండు రోజుల్లో ఐపీఎల్ సీజన్ 18 సందడి ప్రారంభం కాబోతోంది. ఇప్పటికే అన్ని జట్లు ప్రాక్టీస్ మొదలెట్టేశాయి. దాదాపు అందరు ఆటగాళ్లు తమ జట్లతో చేరిపోయారు. ఈ మెగా టోర్నీ ప్రారంభం కావడానికి ముందు బీసీసీఐ అన్ని జట్ల కెప్టెన్లతో సమావేశం ఏర్పాటుచేసింది. దీంతో అందరూ ఒక్కచోట చేరారు. కప్పుతో గ్రూప్ ఫొటోలు దిగారు. పలువురు కెప్టెన్లు సరదాగా మాట్లాడుకుంటూ కనిపించారు. దీంతో అభిమానులు ఈ ఫొటోలు చూసి ముచ్చటపడిపోతున్నారు. ఇక మార్చి 22న ఈడెన్ గార్డెన్ వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్ జరగనుంది.

## ఐపీఎల్ తొలి మ్యాచ్..
## ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్!?

**ఐపీఎల్-2025 సీజన్‌కు రంగం సిద్ధమైంది. మార్చి 22న ఈడెన్‌గార్డెన్స్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్, ఆర్సీబీ జట్లు అమీతుమీ తెల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు అభిమానులకు ఓ బ్యాడ్ న్యూస్. ఆర్సీబీ-కేకేఆర్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే ఛాన్స్ ఉంది.**

ప్రస్తుతం కోల్‌కతా నగరం "ఆరెంజ్ అలర్ట్"లో ఉంది. ఈ క్యాష్‌రిచ్ లీగ్ ప్రారంభం రోజున, అంటే మార్చి 22 (శనివారం) గరిష్టంగా 80 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశముందని అక్కడి వాతవారణ శాఖ పేర్కొంది. శనివారం ఉదయం నుంచి పిచ్‌ను కవర్లతో కప్పి ఉంచే ఛాన్స్ ఉంది.

ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. అంతకంటే ముందు అక్కడ వర్షం కురిసే సూచనలు కన్పిస్తున్నాయి. అదేవిధంగా ఈడెన్‌గార్డెన్స్‌లో ఐపీఎల్18వ సీజన్ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. ఈ ఓపెనింగ్ సెర్మనీకి కూడా ఆటంకం కలిగే అవకాశముంది.

**కేకేఆర్ వర్సెస్ ఆర్సీబీ మ్యాచ్ రోజున వర్ష శాతం అంచనా(అక్యూ వెదర్ ప్రకారం)**

78PM 10%
89 PM 50%
910PM70%
1011 PM 70%

**కేకేఆర్:** అజింక్యా రహానే (కెప్టెన్), రింకు సింగ్, క్వింటన్ డి కాక్, రహ్మానుల్లా గుర్బాజ్, అంగ్క్రిష్ రఘువంశీ, వెంకటేష్ అయ్యర్, రమణదీప్ సింగ్, ఆండ్రీ రస్సెల్, అన్రిచ్ నార్ట్జే, హర్షిత్ రాణా, సునీల్ నరైన్, వరుణ్ చక్రవర్తి, మయాంక్ మార్కండే, రోవ్‌మన్ పావెల్, మనీష్ పాండే, స్పెన్సర్ జాన్సన్, లవ్‌నీత్ సిసోడియా, అనుకుల్ రాయ్, మొయిన్ అలీ, చేతన్ సకారియా

**ఆర్సీబీ:** రజత్ పాటిదార్ (కెప్టెన్), విరాట్ కోహ్లి, యశ్ దయాల్, జోష్ హేజిల్‌వుడ్, ఫిల్ సాల్ట్, జితేష్ శర్మ, లియామ్ లివింగ్‌స్టోన్, రసిఖ్ దార్, సుయాష్ శర్మ, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, నువాన్ తుషార, మనోజ్ భాండాగే, జాకబ్ బెతేల్, దేవదత్ పడిక్కల్, స్వస్తిక్ చికార, లుంగి ఎన్గిడి, అభినందన్ సింగ్, మోహిత్ రాథీ





## విడాకులు తీసుకున్న
## చాహల్, ధన శ్రీ వర్మ

**భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ విడాకులు తీసుకున్నారు.**

భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ , ధనశ్రీ వర్మ విడాకులు తీసుకున్నారు. ముంబయిలోని బాంద్రా ఫ్యామిలీ కోర్టు విడాకులు మంజూరు చేసినట్లు చాహల్ తరఫు న్యాయవాది నితిన్ కుమార్ గుప్తా వెల్లడించారు. విడాకుల పిటిషన్ విచారణ కోసం చాహల్, ధన శ్రీ ఇవాళ మధ్యాహ్నం కోర్టుకు వచ్చారు. పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకుంటున్నందున ఆరు నెలల తప్పనిసరి విరామ (కూలింగ్ ఆఫ్ పీరియడ్) గడువును బాంబే హైకోర్టు రద్దుచేసింది. మార్చి 20లోగా విడాకుల పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవాలని ఫ్యామిలీ కోర్టును ఆదేశించింది. ఈ క్రమంలో విచారణ చేపట్టిన కోర్టు విడాకులు మంజూరు చేసింది. ధన శ్రీకి భరణం కింద రూ.4.75 కోట్లు ఇవ్వడానికి చాహల్ అంగీకరించినట్లు సమాచారం. ఆ మొత్తంలో ఇప్పటివరకు రూ.2.37 కోట్లు చెల్లించినట్లు తెలుస్తోంది.

చాహల్, ధన శ్రీల వివాహం 2020లో జరిగిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సామాజిక మాధ్యమాల్లో వీరిద్దరూ ఒకరినొకరు అన్‌ఫాలో చేసుకోవడం, ధనశ్రీ తన పేరు నుంచి 'చాహల్' పదాన్ని తొలగించడంతో వీరు విడిపోతున్నారని వార్తలొచ్చాయి